

అన్నదాతకు ఏదీ 'భరోసా'

రైతుల సంక్షేమానికి గత ప్రభుత్వం వానా కాలం, యాసంగి సీజన్లలో అవసరమైన పెట్టుబడి సాయాన్ని అందించారు. 8లో▸



నేరాలకు పాల్పడితే..

మారుతున్న కాలానికి అనుగుణంగా తండాల్లో మార్పు అవసరమని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. 8లో▸



పేర్లు లేక.. రేషన్ అందక

సంవత్సరాలుగా రేషన్ కార్డులలో మార్పులు చేర్పుల ప్రక్రియ జరగకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 9లో▸

కొందరికే మాఫీ

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన రుణమాఫీ హామీ నీటిమూటలా మారింది. అర్హులుగా ఉన్నప్పటికీ సగం మంది రైతులకే మాఫీ వర్తించడంతో వారు వ్యవసాయాధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నారు.

నేటికీ వీడని గందరగోళం

- తొలగని అన్నదాతల అవస్థలు
- గ్రీవెన్స్ సెల్‌కు 25వేలకు పైగా ఫిర్యాదులు
- కుటుంబ ప్రాతిపదినక వివరాలు అప్‌లోడ్ చేస్తున్న వ్యవసాయ శాఖ



వికారాబాద్ ఏడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

వికారాబాద్: జిల్లాలో రుణమాఫీ బాధితులు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నారు. రైతులకు తలెత్తిన ఈ అయోమయ పరిస్థితి నేటికీ వీడడం లేదు. ఈ ప్రక్రియ మూడు దశల్లో పూర్తయినా వేల సంఖ్యలో అన్నదాతలకు రుణమాఫీ వర్తించక ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న ఈ పథకంలో అధికారులు, బ్యాంకులు పెడుతున్న కొర్రీలు రైతన్నల పాలిట శాపంగా మారుతున్నాయి. ఈ పథకాన్ని కుటుంబం ప్రాతిపదికగా తీసుకుని అమలు చేస్తున్న నేపథ్యంలో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు ఫ్యామిలీ గ్రూపింగ్ చేస్తున్నారు. అధికారులు గ్రీవెన్స్ సెల్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను కుటుంబాలుగా క్రోడీకరించి ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అర్హత ఉన్నప్పటికీ మాఫీ వర్తించని రైతులను ఎప్పుడు రుణవిముక్తులను చేస్తుందనేది ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో రైతులు ఓ వైపు ఫిర్యాదులు చేస్తూనే వివిధ రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు.

25 వేల ఫిర్యాదులు.. 18,431 కుటుంబాలు

రుణమాఫీ అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌కు రైతుల నుంచి ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రైతులు 25 వేలకు పైగా ఫిర్యాదులు సమర్పించారు. అధికారులు ఈ దరఖాస్తులను ఫ్యామిలీ గ్రూపింగ్ చేస్తున్నారు. 25 వేలకు పైగా వచ్చిన దరఖాస్తులను 18,431 కుటుంబాలుగా గుర్తించారు. ఇందులో 11,596 మంది రైతు కుటుంబాల వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. మరో 6,835 రైతుల కుటుంబాలు పెండింగ్‌లో ఉన్నాయి. రుణమాఫీ విషయంలో అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు రైతులు రోజుకు వందల సంఖ్యలో ఫోన్ కాల్స్ చేస్తున్నారు. రేషన్ కార్డులు లేకపోవడం, ఆధార్ మిస్ మ్యాచ్‌వల్ల ఎక్కువ శాతం రుణమాఫీ పథకానికి దూరమైనట్లు తెలుస్తోంది.

ఫిర్యాదుల వివరాలు

మండలం	ఫిర్యాదులు
కొడంగల్	1,530
పరిగి	1,495
తాండూరు	1,434

సగానికి మించని రుణమాఫీ

ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు అమలు చేస్తున్న రుణమాఫీ మూడు దశల్లో కలిపి సగం మంది రైతులకే లబ్ధి చేకూరింది. జిల్లా వ్యాప్తంగా 5.90లక్షల ఎకరాల సాగుభూమి ఉండగా 2.50లక్షల మంది రైతులున్నారు. గతేడాది(2023–24)లో 1,78,522 మంది రైతులు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు స్వీకరించారు. ప్రతీ సంవత్సరం రైతులు సగటున రూ.1,900 కోట్ల వరకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకుంటున్నారు. మాఫీలో ప్రభుత్వం రైతు కుటుంబాలకు నిబంధన పెట్టింది. దీంతో మూడు దశల్లో కలిపి సగం మంది రైతులకే రుణవిముక్తి లభించినట్లైంది.

రుణమాఫీ వివరాలు

విడత	రైతులు	మాఫీమొత్తం (రూ.కోట్లలో)
1వ	46,633	రూ.256.26
2వ	26,438	రూ.262.64
3వ	18,885	రూ.247.71

ఆందోళన అనవసరం: డీఏఓ



రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఏఓ మోహన్‌రెడ్డి

ధారూరు: రుణమాఫీకాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ధారూరు రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. వ్యవసాయ విస్తరణ అధికారులు అర్హుల వివరాలు సేకరించి పంపించారని గుర్తు చేశారు. ఇతర సమస్యలుంటే సంబంధిత ఏఈఓలకు ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తారని చెప్పారు. ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని చెప్పారు. పంటల సాగు, సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు, దిగుబడిపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు, సూచనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంట రుణమాఫీ మండల నోడల్ అధికారి సంజూరాథోడ్, ఏఈఓలు రైతులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

రోడ్ల అభివృద్ధికి సహకరించండి

- జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయండి
- కేంద్రమంత్రిని కోరిన అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి/ధారూరు: వికారాబాద్ నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి సహకరించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఢిల్లీలో నిర్వహించిన 10వ కామన్ వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఇండియా రీజియన్ కాన్ఫరెన్స్‌లో స్పీకర్ పాల్గొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నివాసంలో రోడ్ల అభివృద్ధి కోసం వినతిపత్రం అందజేశారు. నియోజవర్గంలోని మూడు ప్రధాన రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని మంత్రిని కోరారు. కోకాపేట–ఓఆర్ఆర్ జంక్షన్–శంకర్‌పల్లి–మోహిన్‌పేట–మర్పల్లి–బుధేరా రోడ్డు(80కి.మీ), తాండూరు–పెద్దేముల్–కోట్‌పల్లి–మోమిన్‌పేట్–సదాశివపేట రోడ్డు(63.20కి.మీ), వికారాబాద్–మోమిన్ పేట్ రోడ్డు(19.20కి.మీ) ఉన్నాయని వివరించారు. సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ స్కీం(సీఆర్ఐఎఫ్) నిధులు మంజూరు చేసి ఏడు రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. వీటిలో తాండూరు–ధారూరు(రూ.45కోట్లు) , కొత్తగడి–బంట్వారం(రూ.50కోట్లు), కేసారం–తొర్మామిడి(రూ.60కోట్లు), వికారాబాద్–ధారూరు రైల్వే స్టేషన్ రోడ్డు(రూ.55కోట్లు), బషీరాబాద్–మైలావర్ రోడ్డు(రూ.35కోట్లు), మారెపల్లి–మదనంతాపూర్ రోడ్డు(రూ.40కోట్లు), పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బంట్వారం వయా రాంపల్లి (రూ.35కోట్లు) ఉన్నాయని చెప్పారు. వెంటనే నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. వీరి వెంట పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ స్పీకర్ ఓఎస్డీ వెంకట్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మాణిక్‌రెడ్డి తదితరులున్నారు.

సమయపాలన, క్రమశిక్షణ ప్రధానం



జిల్లాకు రిపోర్టు చేసిన పీఎస్ఐలు

అనంతగిరి: పోలీస్ శాఖలో ఉద్యోగం అంటే గర్వపడేలా పనిచేసి మంచిపేరు తీసుకురావాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఇటీవల టీఎస్‌పీఏలో శిక్షణ పూర్తి చేసుకున్న 17 మంది పోలీస్ సబ్–ఇన్‌స్పెక్టర్లు వికారాబాద్ జిల్లాలో రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణ రెడ్డి వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలు సర్వీస్‌లో దోహదపడుతాయన్నారు. సమయపాలన, క్రమశిక్షణపై దృష్టి సారించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి నిస్వార్థ సేవలందించాలన్నారు. తెలియని విషయాలుంటే ఉన్నతాధికారులు, సీనియర్లతో చర్చించి పరిజ్ఞానం పెంచుకోవాలని చెప్పారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు, బీఆర్ఎస్ నాయకులు

మర్పల్లిలో టెన్షన్ టెన్షన్

- పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల బాహాబాహీ
- పరస్పర ఆరోపణలతో ఉద్రిక్త వాతావరణం
- పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు

మర్పల్లి: బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు బాహాబాహీకి దిగారు. మర్పల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్లూర్ శివారులోని చామంతి బల రామరాజు పొలంలో గత శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఇదే గ్రామానికి చెందిన మర్పల్లి రాములు (55) మతిస్థిమితం కోల్పోయి.. 15 రోజులుగా కనిపించకుండా పోయాడు. ఈ నేపథ్యంలో మృతదేహం రాములుదేనని నిర్ధారించారు. వీరి దాయాదులైన నవీన్, ప్రవీణ్‌పై అనుమానం రావడంతో ఇరువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ జరిపారు. అయితే పీఎస్ నుంచి పారిపోయిన ప్రవీణ్ బీఆర్ఎస్ నాయకుల వద్దకు వెళ్లి విషయం చెప్పాడు. ఇది మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు తెలియడంతో మర్పల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఈక్రమంలో అక్కడికి వచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి పోలీసులు, కాంగ్రెస్ నాయకులు, స్పీకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్ నేతలు సురేష్, రామేశ్వర్, మల్లేష్ యాదవ్, రఫీ, పట్లూర్ సురేష్ తదితరులు పీఎస్ వద్దకు వచ్చి ఆనంద్‌తో వాగ్వాదానికి దిగారు. పదేళ్ల పాటు హత్యా రాజకీయాలు చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కక్షా రాజకీయాలకు తెరలేపిందని, అధికార పార్టీ నేతల అండదండలతో అక్రమ కేసులు బనాయిస్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించారు. అమాయకులను తీసుకెళ్లి విచారణ పేరుతో తీవ్రంగా కొట్టారన్నారు. ఇరువర్గాల పరస్పర ఆరోపణలతో టెన్షన్ వాతావరణం నెలకొంది. అక్కడే ఉన్న సీఐ నవీన్‌కుమార్, మర్పల్లి, మోమిన్‌పేట సిబ్బందిని అప్రమత్తం చేసి పరిస్థితి చేయిదాటకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను అక్కడి నుండి పంపించేశారు. నేరుగా వికారాబాద్ వెళ్లిన ఆనంద్ ఘటనపై ఎస్పీ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు.



పోటీగా ఆందోళన చేసిన కాంగ్రెస్ నేతలు

రుగ్మతలను రూపుమాపుదాం

కలెక్టర్ ప్రతీక్‌జైన్



ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట: చిన్నారుల శారీరక రుగ్మతలు రూపుమాపేందుకు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన ఆర్‌బీఎస్‌కే(రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం) కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పైలెట్ ప్రాజెక్టుగా మండలంలో చేపట్టిన ఇంటింటి వివరాలను క్రోడీకరించారు. ఈ సర్వేలో రుగ్మతలున్న 3,825 ఆరేళ్లలోపు చిన్నారులను గుర్తించారు. వీరిలో 350 హైరిస్క్, 38 మంది శారీరక రుగ్మతలున్నవారిని హైదరాబాద్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆకార్, ఆశ స్వచ్ఛంద సంస్థలు, జిల్లా అధికారులు, డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్, పీహెచ్‌సీ డాక్టర్ హేమంత్‌కుమార్, తహసీల్దార్ పద్మావతి పాల్గొన్నారు.

పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలి

నవాబుపేట: పాత అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిపుల్ ఆర్ నిర్మించాలని పలువురు రైతులు కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత అలైన్‌మెంట్ ప్రకారం ఫారెస్ట్ భూములు ఎక్కువగా ఉండి పట్టా భూములు తక్కువగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం మార్చిన అలైన్‌మెంట్‌తో వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లాల్‌కృష్ణకే డీసీసీ..?

పరిగి: జాతీయ కాంగ్రెస్ పార్టీ ఇటీవలే పీసీసీ నియామక ప్రక్రియ పూర్తి చేసింది. ఇక జిల్లా అధ్యక్షుల ఎంపికపై దృష్టి సారించిందనే చర్చ లు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా గతంలో జిల్లా అధ్యక్షుడిగా ఏ సామాజిక వర్గానికి చెందిన వారున్నారనే వివరాలు సేకరిస్తోంది. తాండూరు నియోజకవర్గానికి ఇప్పటికే కార్పొరేషన్ పదవుల్లో పెద్దపీట వేశారు. కొడంగల్ ముఖ్యమంత్రి నియోజకవర్గం, వికారాబాద్ శాసనసభ స్పీకర్ నియోజకవర్గం అవ్వడంతో పరిగి నియోజకవర్గానికి చెందిన వ్యక్తికే అధ్యక్ష పదవి దక్కే చాన్స్ ఉందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇప్పటికే డీసీసీ ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్న లాల్‌కృష్ణ అధ్యక్ష రేసులో ఉన్నాడనే చర్చలు సాగుతున్నాయి. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా ఆయన ఎన్నో పోరాటాలు చేశారు. కాంగ్రెస్ అధికారంలో లేకున్నా డీసీసీ ఉపాధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేశాడు. బీసీ సామాజిక వర్గానికి చెందిన లాల్‌కృష్ణకే డీసీసీ అధ్యక్షపదవి కట్టబెడుతుందని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

నాణ్యమైన విద్య, భోజనం



కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్–కలెక్టర్ ఉమాశంకర్

- మెనూ తప్పక పాటించాలి
- తాండూరు సబ్–కలెక్టర్ ఉమాశంకర్

పెద్దేముల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందజేయాలని తాండూరు సబ్–కలెక్టర్ ఉమాశంకర్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు సరిపడగా గదులు ఉన్నాయా..? ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని ప్రిన్సిపాల్ రాజేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. గదుల కొరత ఉన్నందున బోధన, బస ఒకే గదిలో కొనసాగిస్తున్నామని ప్రిన్సిపాల్ వివరించారు. కొత్త భవన నిర్మాణం పూర్తయ్యే వరకు సర్దుకోవాలని సబ్–కలెక్టర్ ఉమాశంకర్ విద్యార్థులకు సూచించారు. అనంతరం స్టోర్ రూం, వంట గది, నూతన భవనాన్ని పరిశీలించారు. ప్రతీ విద్యార్థి ఇంగ్లిష్‌లో మాట్లాడేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగితే పాఠశాలకు సైతం మంచి పేరువస్తుందన్నారు. సబ్–కలెక్టర్ వెంట పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ తదితరులున్నారు.

న్యూస్‌రీల్

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: వికారాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పలు పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను ఈ నెల 27, 28, 30 తేదీల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ల్యాబ్ అటెండర్–15, డేటా ఎంట్రీ ఆపరేటర్–07, రేడియో గ్రాఫిక్ టెక్నీషియన్–3, సిటీ స్కాన్ టెక్నీషియన్–3, ఈసీజీ టెక్నీషియన్–2, అనస్తీషియా టెక్నీషియన్–4, దోబీ–4, ఎలక్ట్రీషియన్–2, ప్లంబర్–1, డ్రైవర్(హెవీ వెహికిల్)–1, థియేటర్ అసిస్టెంట్–4, గ్యాస్ ఆపరేటర్–2, వార్డ్‌బాయ్–4 మొత్తం 52 పోస్టులు పొరుగు సేవల విధానంలో భర్తీ చేస్తామన్నారు. పూర్తి వివరాలకు www.fmcvikarabad.orf వెబ్‌సైట్‌లో పొందుపర్చామని చెప్పారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్

దౌల్తాబాద్: అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గోపాల్ తదితరులు ఉన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: నూతన ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం విచారకరమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి లేక పోవడంతో విద్యా వ్యవస్థపై అజమాయిషీ కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి విద్యాశాఖకు మంత్రిని నియమించాలని కోరారు.

శునకాల జనన నియంత్రణకు చర్యలు

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం



ఏబీసీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సదానందం

పరిగి: శునక జనన నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం అన్నారు. మంగళవారం ఆయన పట్టణ కేంద్రంలో ఏబీసీ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వీధి కుక్కలకు జనన నియంత్రణ లేని కారణంగా కుక్కల బెడద ఉందన్నారు. అందుకు ప్రభుత్వం కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్‌లను చేసేందుకు అన్ని ఏర్పాట్లను చేసిందన్నారు. వార్డుల వారీగా వీధి కుక్కలకు ఆపరేషన్‌లు నిర్వహిస్తామన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి మృతిపై విచారణ

అనంతగిరి: వికారాబాద్ మండలం పులుమద్దికి చెందిన ఏడు నెలల గర్భిణి జగదాంబ ఈనెల 19న మృతి చెందింది. ఈ విషయంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పల్వన్‌కుమార్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు డిప్యూటీ డీఎంహెచ్ఓ జీవరాజు, మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పవిత్రలను విచారణ అధికారులుగా నియమించారు. విచారణలో భాగంగా వారు తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి, వికారాబాద్‌లోని హృదయ ఆస్పత్రిని సందర్శించి జగదాంబకు అందించిన వైద్యం, రెఫరల్‌కు సంబంధించిన కారణాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబీకుల స్టేట్‌మెంట్‌ను తీసుకుని జిల్లా వైద్యాధికారికి సమర్పిస్తామని చెప్పారు.

క్లుప్తంగా

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర



చెరువుకట్ట వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి వ్యవహరించాలని వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర సూచించారు. తమ గ్రామ పరిధిలోని మ్యాకలోని చెరువును పరిరక్షించాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట లింగంపల్లి గ్రామస్తులు బైఠాయించిన నేపథ్యంలో గ్రామాన్ని ఆర్డీఓ మంగళవారం సందర్శించారు. చెరువుకట్టను పరిశీలించి ఇరిగేషన్ శాఖ అధికారులతో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరికైనా అభ్యంతరాలుంటే చట్టపరిధికి లోబడి నడుచుకోవాలి, తప్పిస్తే ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడరాదని సూచించారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, పోలీసుశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీజీటీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కుల్కచర్ల: మండల పరిధిలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో గణితం పీజీటీ పోస్టుకు దరఖాస్తులు తీసుకుంటున్నామని ప్రిన్సిపాల్ జ్యోతి హెప్సిబా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు ఎంఎస్సీ, బీఈడీ వారు అర్హులని ఆమె వివరించారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలన్నారు.

పీసీసీ చీఫ్‌కు వినతులు



మహేష్‌కుమార్‌గౌడ్‌తో మర్రి రాజిరెడ్డి

బంట్వారం: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆ పార్టీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రి రాజిరెడ్డి మంగళవారం గాంధీ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి పలు అంశాలపై పీసీసీ చీఫ్‌తో చర్చించారు. అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయడంతో పాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం అందేలా చూడాలని ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన మహేష్‌కుమార్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

అలుగు నీటిలో పడి వ్యక్తి దుర్మరణం



రాములు (ఫైల్)

మోమిన్‌పేట: చెరువు అలుగు దాటుతూ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మోమిన్‌పేటలో మంగళవారం ఉదయం చోటు చేసుకొంది. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని టేకులపల్లికి చెందిన మన్నె రాములు(53) ఉదయం 11గంటలకు ఇంటి నుంచి వెళ్లి, గ్రామ సమీపంలోని అయిమ చెరువు దాటుతుండగా కాలు జారి కింద పడిపోయాడు. ఈత రాక పోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అన్నదాతకు దక్కని ‘భరోసా’



పొలాన్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతు (ఫైల్)

పరిగి: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వ హయాంలో వానకాలం, యాసంగి సీజన్‌లలో అవసరమైన పెట్టుబడి సాయాన్ని అందించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రైతు భరోసా పేరిట ఎకరానికి రూ.15 వేలు చెల్లిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా రైతు భరోసాపై ఊసెత్తడమే లేదు. వానకాల సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తుంది. పెట్టుబడి సహాయాన్ని ఇంకెప్పుడు అందిస్తారోనని అన్నదాతలు వాపోతున్నారు. ప్రస్తుతం రైతు రుణమాఫీని మూడు విడతల్లో సగం వరకే చేసి మిగతా వారికి చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా మంది రుణమాఫీ, రైతు భరోసా కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

అనుమానాలకు ఊతం

వానాకాలం సీజన్‌లో అప్పులు చేసి పంటలను సాగు చేశామని, పెట్టుబడి సహాయం కోసం ఎదురుచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సహాయాన్ని జూన్ మాసంలోనే అందిస్తే విత్తనాలు, ఎరువులు, ఇతర ఖర్చులకు ఉపయోగపడేవి. ముందస్తుగా పెట్టుబడిని అందిస్తే పంటలు సకాలంలో సాగు చేయడంతో దిగుబడులు కూడా పెరిగేవి. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసినందుకు పెట్టుబడి సహాయాన్ని అందించేందుకు అలసత్వం చేస్తుందన్న అభిప్రాయాలు కర్షకుల్లో వ్యక్తమవుతున్నారు. సీజన్ ముగుస్తుండడంతో అసలు పెట్టుబడి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందో లేదో అర్థంకాని పరిస్థితులు ఉన్నాయని అన్నదాతల మొదడులో మెదులుతున్న అనుమానాలు.

కాలయాపన ఎందుకు?

రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు పథకంపై స్వల్ప మార్పులతో రైతుల నుంచి అభిప్రాయ సేకరణను చేపట్టింది. దీన్ని రైతు భరోసా కింద జులైలో చేపట్టి మమ అనిపించారు. ప్రభుత్వం గతంలో పలు సంబర్భాల్లో రైతుకు రూ.15వేల రైతు భరోసాను త్వరలోనే అందిస్తామని హామీ ఇచ్చింది. అయినా ఇప్పటి వరకు ఎక్కడ రైతు భరోసాపై మాట్లాడకపోవడంతో అన్నదాతలు సందిగ్ధంలో పడ్డారు. అభిప్రాయ సేకరణ చేసి మూడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనలు రాకపోవడంతో రైతులు నిత్యం వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరిగి అధికారులను విచారిస్తున్నారు. రైతు భరోసా అమలులో ప్రభుత్వం జాప్యం చేయడంపై పలురకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది రైతులైతే బంగారు నగలు కుదవపెట్టి మరీ పంట పెట్టుబడికి సమకూర్చుకుంటున్నారు.

సాగుసాయం కోసం ఎదురుచూపులు

- వానకాలం సీజన్ ముగుస్తున్నా అందని సాయం
- మరో పక్షం రోజుల్లో యాసంగి సీజన్

అప్పులు చేసి సాగు చేశా



నాకున్న ఆరు ఎకరాల్లో ప్రతి పంటకు రూ.30వేల వరకు రైతు బంధు వచ్చేది. దీంతో సరిపడా మందులు తీసుకువచ్చి పంటలు సాగు చేశా. కానీ గత రెండు సీజన్‌లుగా రైతు బంధు సక్రమంగా రావడంతో లేదు. ఈ సీజన్ పెట్టుబడి సాయం ఇంకా రాలేదు. అప్పులు చేసి పంటలు సాగు చేశా.

– పోచయ్య, రైతు, ఇప్పాయిపల్లి

రైతు భరోసా ఇవ్వాలి



సాగు కోసం అప్పులు చేసి ఖరీఫ్‌లో పంటలు సాగు చేశాం. అధిక వర్షాలతో కొంత మేర దెబ్బతిన్నాయి. రైతు భరోసా కోసం ఎంతో ఎదురుచూస్తున్నాం. పెట్టుబడి సాయం వస్తే అప్పులు తీరుస్తామని అనుకుంటున్నాం. ఆలస్యం చేయకుండా ప్రభుత్వం రైతు భరోసా అందించాలి.

– అంజిలయ్య, రైతు, పాలేపల్లి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

డీపీఎం శ్రీనివాస్

దౌల్తాబాద్: మహిళల ఆర్థిక ఎదుగుదలకు ఇందిర మహిళ శక్తి పథకం ఎంతగానో తోడ్పడుతుందని జిల్లా డీపీఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామనకుంట తండాలో మహిళ శక్తి పథకం ద్వారా ఏర్పాటు చేసిన నాటుకోళ్ల పౌల్ట్రీ ఫాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకుస్తుందన్నారు. మహిళల అనుకూల పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్పీ శ్రీనివాస్, ఏపీఎం సాయన్న, సీసీ హరినారాయణ, జయమ్మ తదితరులు ఉన్నారు.



పౌల్ట్రీ ఫాంను పరిశీలిస్తున్న డీపీఎం శ్రీనివాస్

● నిర్మించినా.. ప్రారంభించరా?



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

దుద్యాల్: నిర్మాణం పూర్తయిన మూత్రశాలను ప్రారంభించకపోవడంతో పాఠశాలలోని విద్యార్థినులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో టాయిలెట్‌కు వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందని మండల పరిధిలోని కుదురుమల్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలల నిర్మాణం కోసం ఏడాది క్రితమే నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఇంకా ప్రారంభించలేదు. వాటిని విద్యార్థినులే ఉపయోగంలో తెద్దామంటే తాళం వేయడంతో మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మూత్రశాలల ఎదుట నిరసన చేపట్టి ప్రారంభించాలని అధికారులను కోరారు.

సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు అందించాలి

దోమ: రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను అందించాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా నేత సిద్ధి ఈశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పరిగి, దోమ, బొంరాస్‌పేట్, కుల్కచర్ల, దుద్యాల్, దౌల్తాబాద్ మండలాల్లో ఎక్కువగా వేరుశనగ సాగును ప్రోత్సహిస్తారన్నారు. అట్టి విత్తనాలు సబ్సిడీ ద్వారా రాకపోవడంతో అన్నదాతలు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రైతుల పక్షాన అండగా ఉంటూ వేరుశనగ విత్తనాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

యాలాల: తాండూరు పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో కుళ్లిన మృతదేహం లభ్యమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరమ్మ కాలనీ బ్లాక్ 38లోని 4వ నంబరు గదిలో మహ్మద్ అలీ(38)నివాసం ఉంటున్నాడు. ఇటీవల అలీతో గొడవ పడిన ఆయన భార్య పుట్టింటికి వెళ్లడంతో ఒక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా రెండు రోజుల నుంచి అలీ గది నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన స్థానికులు మంగళవారం యాలాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఎస్‌ఐ శంకర్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గది తలుపులు తెరచి చూడగా కుళ్లిన స్థితిలో అలీ మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం బాడీని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఖాతున్ బీ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



తీవ్ర గాయాలైన నరేష్

పరిగి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణ కేంద్రంలోని తుంకుల్‌గడ్డ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొండపల్లి నరేష్ పని నిమిత్తం పరిగి వచ్చి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో తుంకుల్‌గడ్డ వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయబోయి అదుపు తప్పడంతో కింద పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి, పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



గేదెల కళేబరం

నవాబుపేట: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని చించల్‌పేట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మునగాల రవికి చెందిన రెండు గేదెలు మంగళవారం ఉదయం పొలం వద్ద మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాయి. దీంతో షాక్ కొట్టి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.లక్ష వరకు నష్టపోయాననని బాధిత రైతు విలపించాడు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరాడు.

అటవీ సంపదను రక్షించండి

- అర్బన్ పార్కు అభివృద్ధి పనులు వేగం చేయండి
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు: అటవీ భూముల నక్షా పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: అటవీ సంపదను వృద్ధి చేయడంలో శాఖ అధికారులు కీలకంగా వ్యవహరించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో అటవీ శాఖ తాండూరు ఇన్‌చార్జి రేంజ్ అధికారి రాజేందర్‌తో పాటు అటవీశాఖ అధికారులతో నియోజకవర్గంలోని అటవీ భూములపై సమీక్షించారు. పట్టణ శివారులోని అంతారం–గొట్లపల్లి అటవీ ప్రాంతంలో 110 ఎకరాల అటవీ భూముల్లో అర్బన్ పార్కు అభివృద్ధి పనులపై చర్చించారు. పార్కు నమూనా చిత్రాన్ని పరిశీలించారు. పార్కులో మౌలిక వసతులు కల్పించేలా అభివృద్ధి చేయాలని సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. యోగా షెడ్, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ ప్లే గార్డెన్, వాచ్ టవర్‌తో పాటు గ్రీన్ గార్డెన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. బషీరాబాద్ మండలం మైల్వార్, నీళ్లపల్లి జలాల్‌పూర్, గ్రామ శివారుల్లో ఉన్న అటవీ భూములు అన్యాక్రాంతమవుతున్నాయనే విషయంపై ఎమ్మెల్యే అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అంతర్రాష్ట్ర సరిహద్దులో అటవీభూముల సమస్య పరిష్కారమవుతోందన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

తాండూరు టౌన్: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందజేస్తున్న సీఎంఆర్‌ఎఫ్ పేదల పాలిట వరమని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఎం.మైసమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుంది. ఇందుకుగాను ఎమ్మెల్యే రూ.2లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని, వారికి ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులివ్వండి



మంత్రి కోమటిరెడ్డిని కలిసిన మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

తాండూరు: స్థానికంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్లకు నిధులు కేటాయించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కోరారు. బుధవారం పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆర్‌అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా తాండూరు–హైదరాబాద్ రోడ్డు అధ్వానంగా మారిందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నాలుగు లైన్‌ల రహదారిగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. తాను తాండూరుకు వచ్చిన సమయంలో రోడ్ల పరిస్థితిని గమనించానని, త్వరలోనే తాండూరు ప్రాంతంలోని రోడ్లకు నిధులు కేటాయిస్తానని మంత్రి కోమటిరెడ్డి ఎమ్మెల్యే బీఎంఆర్‌కు భరోసా ఇచ్చారు.

నేరాలకు పాల్పడితే పథకాలు కట్

- తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి
- నెల్లిగడ్డతండాలో అవగాహన సమావేశం



నెల్లిగడ్డతండాలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దేముల్: మారుతున్న కాలానికి అనుగుణంగా తండాల్లో మార్పు అవసరమని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నెల్లిగడ్డతండాలో పోలీస్, ఎక్సైజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నాటు సారా నివారణపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ శాఖ వికారాబాద్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాట్లాడుతూ.. నేరాలకు పాల్పడితే ప్రభుత్వ పథకాలను నిలిపేస్తామని స్పష్టం చేశారు. చిన్న తనంలో తాగుడుకు బానిసవుతున్న యువత చాలా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సారా తయారీ, విక్రయం వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించారు. గతంలో సారా తయారీ కేసులు నమోదైన వారు మళ్లీ దొరికితే రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ముద్దాయిలను పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం సారా తయారు చేయం, విక్రయించం అంటూ గిరిజనులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పెద్దేముల్ తహసీల్దార్ కిషన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మణ్, డీటీఎఫ్ సీఐ శ్రీనివాస్, పెద్దేముల్ ఎక్సైజ్ ఎస్‌ఐ నిజాముద్దీన్, రవికుమార్, సిబ్బంది భీమయ్య, రాజేందర్, సుల్తాన్, మహేశ్, రవి కిషోర్, కృష్ణ, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలన్నింటిని పరిష్కరిస్తాం

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

పరిగి: పట్టణంలో ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టే విధంగా గా ప్రణాళికను సిద్ధం చేస్తామని మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో సాధారణ సమావేశం నిర్వహించారు. రూ.75లక్షల 14, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి స్తంభానికి వీధి దీపం వెలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్లు వార్డుల వారీగా ఎక్కడ ఏ సమస్యలు ఉన్నాయో వాటి వివరాలను అధికారులకు సమర్పిస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు కృష్ణ, వెంకటయ్య, రవీందర్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణలో నిర్లక్ష్యం

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

యాలాల: గ్యాస్ సబ్సిడీతో పాటు ఉచిత కరెంటు పథకానికి సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణలో మండల పరిషత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వివిధ గ్రామాల ప్రజలతో కలిసి ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు గ్యాస్ సబ్సిడీ, ఉచిత కరెంటు వివరాల నమోదుకు ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇచ్చింది. అయితే ఈ వివరాలను నమోదు చేసుకోవడానికి ప్రతి రోజు పదుల సంఖ్యలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు మండల పరిషత్ కార్యాలయానికి వస్తున్నారు. వీరి పట్ల మండల పరిషత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రతి రోజు 30 దరఖాస్తులు తీసుకుని సిబ్బంది లేరంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ పుష్పలీల నిరసన చేస్తున్న వారితో మాట్లాడారు. గ్రామాల వారీగా దరఖాస్తు చేసుకునేందుకు తేదీలను వెల్లడిస్తామని.. ప్రజలు మండలానికి వచ్చి సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకుడు నర్సింహులు తదితరులు ఉన్నారు.

నీటి సరఫరాలో సమస్యలుండొద్దు



శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు, పాల్గొన్న సహాయకులు

బొంరాస్‌పేట: గ్రామాల్లో ప్రజలకు మంచినీటి సరఫరాలో సమస్యలుండొద్దని గ్రిడ్, ఈఈ నాగేశ్వర్‌రావు అన్నారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో 51మంది జీపీ సహాయకులకు ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగు రోజులపాటు నిర్వహించే శిక్షణలో అధికారులు పాల్గొన్నారు. మంచి నీటి సరఫరా, నీటినాణ్యత, నీటి సరఫరా ఫలితాల నమోదు, మరమ్మతులు తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఈఈ శశాంక్, ఏఈఈ గ్రిడ్ రాఘవేంద్ర, మండల ఏఈఈ ఇంట్రా జోయెల్, ఎంపీడీఓ వెంకన్నగౌడ్, ఎంపీఓ మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

దౌల్తాబాద్: ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు దౌల్తాబాద్ ఎస్‌ఐ రవిగౌడ్ ఆధ్వర్యంలో తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో కళాజాత బృందంతో సోమవారం రాత్రి సైబర్ క్రైం నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డయల్ 100, బాల్య వివాహాలు, దొంగతనాలు, ట్రాఫిక్ రూల్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు యాక్సిడెంట్లు, పోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల చట్టాలను గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ ముత్తరాజ్, సిబ్బంది అంజిరెడ్డి, చంద్రశేఖర్, కళాజాత బృందం సభ్యులు అశోక్, హన్మంతు, ఆంజనేయులు, వెంకటేశ్, యాదయ్య, ప్రదీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

అనంతగిరి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వికారాబాద్ మండలం మదన్‌పల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు సదాశివపేటకు చెందిన మంగమ్మ(23)తో వివాహమైంది. వీరికి ఒక పాప ఉండగా.. వ్యవసాయం చేస్తూ గ్రామంలోనే జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగమ్మ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అత్తాపూర్: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ పిస్తాహౌస్ మంచి పీవీ నరసింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్–వే ప్రాంతంలో సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతోపాటు మృతదేహం ఒంటిపై లైట్ పింక్ కలర్ షర్ట్, బ్లాక్ పాయింట్ ధరించి ఉందని, మృతుడి ఆచూకీ తెలిసినవారు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.